

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు



జహీరాబాద్‌లో మహిళా సంఘాలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు



జహీరాబాద్‌లో లబ్ధిదారులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు



జహీరాబాద్ బహిరంగ సభలో శంఖారావం పూరిస్తున్న మంత్రి హరీశ్‌రావు



జహీరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న కళాకారులు, మహిళలు

## హోటల్ మేనేజ్‌మెంట్‌తో యువతులకు ఉపాధి

ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు

కోహీర్, అక్టోబర్ 7: హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో శిక్షణ పొందిన యువతులకు ఉద్యోగవ అకాశాలను కల్పిస్తామని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. శనివారం కోహీర్ మండలంలోని కవేలి జాతీయ రహదారి పక్కన నున్న హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో మహాత్మా జ్యోతిబాపూలే హోటల్ మేనేజ్‌మెంట్ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హోటల్ మేనేజ్‌మెంట్ డిగ్రీ కళాశాలల్లో శిక్షణ పొందిన ప్రతిఒక్కరికీ ఉపాధి కల్పిస్తామని భరోసానిచ్చారు. యువతులకు భవిష్యత్‌లో కళాశాల ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా కోహీర్ ఆర్టీసీ బస్టాండును వినియోగంలోని తీసుకురావాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, బెవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, కలెక్టర్ శరత్, ఆర్డీవో వెంకారెడ్డి, తహసీల్దార్ శాంతకుమారి, కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్ర, విజయ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.



కవేలిలో హోటల్ మేనేజ్‌మెంట్ మహిళా డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు



కవేలి కళాశాలలో శిక్షణా తరగతి గదిని పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు



కవేలి హోటల్ మేనేజ్‌మెంట్ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

# అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

**జహీరాబాద్ ఎట్లుండె.. ఎట్ల చేసినం.. కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నాం..**

- అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తా..
- ఇండ్ల నిర్మాణానికి గృహలక్ష్మి కింద ఆర్థికా సాయం చేస్తాం..
- నియోజకవర్గంలో విద్య,వైద్యం, రోడ్లను ఎంతో అభివృద్ధి చేశాం..
- పోడు పట్టాలిచ్చాం..గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాం..
- ఈ ప్రాంతానికి కాళేశ్వరం నీళ్లు తెస్తున్నాం..
- మన దగ్గర సంక్షేమ పాలన.. పక్కన కర్ణాటకలో పథకాలే లేవు..
- కాంగ్రెస్,బీజేపీ మాటలు నమ్మితే ఆగమైతం..
- ముస్లిం మైనార్టీల కోసం గురుకులాలు ఏర్పాటు చేశాం..
- కాంగ్రెస్ సెక్యులర్ పేరుతో ముస్లిం ఓట్లు వేసుకుని అభివృద్ధిని విస్మరించింది..
- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు లోకల్.. ఆయనను ఆశీర్వదించండి
- జహీరాబాద్ బహిరంగ సభలో మంత్రి హరీశ్‌రావు
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమిపూజ చేసిన మంత్రి

జహీరాబాద్, అక్టోబర్ 7: కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రంలో అమలుచేయని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నదని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీర్ హరీశ్‌రావు అన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రారంభించి మంత్రి హరీశ్‌రావు ప్రసంగించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డ రాష్ట్రంలో పార్టీని గెలుపించుకోలేన్నారు. తెలంగాణలో హంగు వస్తుందని మాట్లాడుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు తెలంగాణలో ఓటమి తప్పదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ శాసనసభ ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించి మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. బీజేపీ గత ఎన్నికల్లో ఒక శాసనసభ స్థానంలో గెలుపొందిందన్నారు. ఈ సారి ఆ ఒక్క సీటు కూడా గెలువలేరన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా రాదని మంత్రి చెప్పారు. జహీరాబాద్‌కు పక్కనున్న కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎందుకు రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేయడం లేదన్నారు. కర్ణాటకలో అమలు చేయని పథకాలు తెలంగాణలో అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసే కుట్ర చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇవ్వని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. తెలంగాణలో ముస్లిం మైనార్టీ విద్యార్థులు చదువుకొనేందుకు గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశామన్నారు. కర్ణాటక, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రాత్రి పడుకొనే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ పేరుతో ముస్లిం ఓట్లు వేయించుకొని అభివృద్ధి చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముస్లింలు డ్రైవర్లుగా, ఆటో డ్రైవర్లు పనిచేశారని, తెలంగాణ ప్రభుత్వ హయాంలో డాక్టర్లు, ఇంజినీరింగ్ చదువుకుంటున్నారన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. బీజేపీ గెలువది, కాంగ్రెస్ లేవదు అన్నారు. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా తాగునీరు సరఫరా చేయలేదన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులకు అందజేస్తున్నామని మంత్రి చెప్పారు. కర్ణాటకలో పింఛన్ రూ. 600 ఉంటే తెలంగాణలో రూ. 2000 ఉందన్నారు. అక్కడ ఎందుకు పింఛన్ ఎక్కువ ఇవ్వడం లేదన్నారు.



శనివారం రాత్రి జహీరాబాద్ బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

### మాణిక్‌రావు లోకల్... పొరుగు వ్యక్తులు వస్తున్నారు జాగ్రత్త..

జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు లోకల్ వ్యక్తి, కాంగ్రెస్ పార్టీకి చెందిన పొరుగు వ్యక్తులు వస్తున్నారు జాగ్రత్తగా ఆలోచన చేయాలని మంత్రి ప్రజలను కోరారు. మాణిక్‌రావు పేద కుటుంబానికి చెందిన వ్యక్తి, స్థానికంగా ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించే నాయడుడు మరోసారి ఎన్నికల్లో మాణిక్‌రావును ఆశీర్వదించాలని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేస్తారు జాగ్రత్త అన్నారు. పొరుగు వ్యక్తులతో జాగ్రత్తగా ఉండి ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలుపించాన్నారు. జహీరాబాద్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఉంటే పనులు జరుగుతాయి. ఇతరులు ఎమ్యెల్యే ఉంటే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కావని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి 30 స్థానాల్లో అభ్యర్థులు లేరన్నారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 88 స్థానాల్లో గెలుపొందిందని, ఈ సారి 100 స్థానల్లో విజయం సాధించి, హ్యాట్రిక్ సాధిస్తుందన్నారు. పక్క ఇంటివాడు మనోడు కాడు, జాగ్రత్తగా ఆలోచన చేసి ఓట్లు వేయాలన్నారు.



### గిరిజనులకు 10శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దే..

రాష్ట్రంలో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు కలిపించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని మంత్రి హరీశ్‌రావు అన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలు చేశామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ 2009లో జరిగిన ఎన్నికల్లో గిరిజన తండాలను గ్రామ పంచాయతీలు చేస్తామని హామీ ఇచ్చిన అమలు చేయలేదన్నారు. మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాల్లో ఉన్న మోతిమాత జాతరకు రూ. కోటి నిధులు మంజూరు చేసి ఘనంగా ఉత్సవాలు జరిపించమన్నారు. కాంగ్రెస్ పార్టీ గిరిజనుల సంక్షేమన్ని ఎప్పుడూ పట్టించుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. గిరిజనుల కలలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిజం చేసిందన్నారు.

### కుల సంఘాల సామూహిక భవనాలకు స్థలం, నిధులు మంజూరు

జహీరాబాద్ పట్టణంలో రెడ్డి సంఘం భవన నిర్మాణం కోసం స్థలం ఇచ్చి రూ. 80 లక్షలు మంజూరు చేశామని మంత్రి చెప్పారు. పట్టణంలో ఉన్న విశ్రాంతి ఉద్యోగులకు భవనం నిర్మాణం కోసం స్థలం, నిధులు మంజూరు చేశామన్నారు. వీడియో, ఫొటోగ్రాఫర్ల సంఘానికి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. ముదిరాజ్, యాదవ్‌ల కుల సంఘాలకు సామూహిక భవనాలు మంజూరు చేసి, స్థలంతో పాటు నిధులు మంజూరు చేశామన్నారు. ముస్లిం, క్రైస్తవులకు శ్మశాన వాటికలకు భూమి ఇచ్చామన్నారు.



జహీరాబాద్‌లో ముస్లిం మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

### జహీరాబాద్‌లో రూ.175 కోట్లతో అభివృద్ధి పనులు

జహీరాబాద్ పట్టణంలో రూ.175 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించమని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. 3వేల గృహలక్ష్మి ఇండ్లకు నిధులు మంజూరు చేసి మంజూరు పత్రలు అందజేశామన్నారు. హోతి(కే) శివారులో 666 ఇండ్లు నిర్మాణం చేసి లబ్ధిదారులకు అందజేశామన్నారు. ఎస్‌హెచ్‌జీ సంఘాలకు రూ. 204 కోట్లు చెక్కులు పంపిణీ చేశామన్నారు. క్రీడాకారులకు క్రీడాకిట్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ముస్లింలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కట్టు మిషన్లు అందజేశామన్నారు.

### జహీరాబాద్‌కు కాళేశ్వరం నీరు అందిస్తాం


జహీరాబాద్ నియోజకవర్గంలో ప్రతి ఎకరానికి కాళేశ్వరం నీటిని అందిస్తామని మంత్రి చెప్పారు. ఒక్కటి, రెండేండ్లలో వ్యవసాయానికి సాగు నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంజీరా నదిపై సింగూర్ ప్రాజెక్టు వద్ద పనులు జరుగుతున్నాయని చెప్పారు. వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తొమ్మిదేండ్లలో వ్యవసాయం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు.

### సర్కార్ దవాఖానలో మెరుగైన వైద్యం

జహీరాబాద్ పట్టణంలోని సర్కార్ దవాఖానలో కార్పొరేట్ తరహాలో వైద్యసేవలు అందిస్తున్నాం. మాతా, శిశు దవాఖాన నిర్మాణం కోసం రూ.12 కోట్లు మంజూరు చేశామని మంత్రి చెప్పారు. గతంలో జహీరాబాద్ ఎమ్మెల్యేగా డాక్టర్ గీతారెడ్డి ఉన్నా సర్కార్ దవాఖానను పట్టించుకోలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్కారు దవాఖానలో మెరుగైన సౌకర్యాలు కలిపించిందన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎం కేసీఆర్ జిల్లాకో వైద్య కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. సమావేశంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయ కర్త దేవీప్రసాద్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ తన్వీర్, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం. శివకుమార్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, జడ్పీ చైర్మన్ మంజుశ్రీ, ఆర్‌డీవో వెంకారెడ్డి, వివిధ శాఖల అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి పర్యటన సక్సెస్

- మంత్రి పర్యటనతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం
- భారీగా తరలివచ్చిన జనం
- సంగమేశ్వరతో వ్యవసాయ భూములు సస్యశ్యామలం
- నెరవేరిన పేదడి సొంతింటి కల
- ఇంటింటికీ తాగునీళ్లు.. పక్క రాష్ట్రాల్లో కన్నీళ్లు



జహీరాబాద్/ కోహీర్/ ఝరాసంగం: ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీర్ హరీశ్‌రావు పర్యటన విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం కనిపిస్తున్నది. శనివారం ఝరాసంగం, జహీరాబాద్, కోహీర్ మండలాల్లో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించి మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు హెలిక్యాప్టర్‌లో ఝరాసంగం మండలంలోని ఎల్గొయి – బర్థిపూర్ శివారులో ఉన్న నిమ్జ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఝరాసంగంలో ఉన్న కేతకీ సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఝరాసంగం గ్రామంలో ఉన్న ప్రధాన రోడ్డును నాలుగు లేన్లు నిర్మాణం చేసేందుకు శంకుస్థాపన చేశారు. బిడెకన్నె గ్రామంలో ఎస్సీ రైతులకు ఇచ్చిన భూముల్లో బోర్లను ప్రారంభించారు. ఎస్సీ మహిళలు సేంద్రియ వ్యవసాయం చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. బిడెకన్నె గ్రామంలో భూ సమస్యలు లేని గ్రామంగా చేశామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వ్యవసాయానికి 3గంటల కరెంట్ చాలు అంటున్నారు. వ్యవసాయానికి 3 గంటలు సారిపోతుందా అని రైతులను అడిగారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేస్తే కరెంట్ కష్టాలు తప్పవన్నారు. ఎస్సీ మహిళా రైతులు సామూహిక వ్యవసాయం చేసి అభివృద్ధి సాధించాలన్నారు. ఆరోణ్య సంస్థ మంచి పనులు చేసి దేశంలోనే ఆదర్శంగా ఉందన్నారు. బిడెకన్నె గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామన్నారు. రైతులకు రైతుబంధు ఇచ్చి అందుకుంటున్నారు.

### జహీరాబాద్‌లో రూ. 250 కోట్లతో అభివృద్ధి పనులు

జహీరాబాద్‌లో రూ.250 కోట్లుతో అభివృద్ధి పనులు ప్రారంభించామని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. పేదలకు గృహలక్ష్మి పత్రలు మంజూరు చేశామన్నారు. మహిళా సంఘాలకు బ్యాంకు లీకేజీ ద్వారా రుణలు అందజేశామన్నారు. గత ఏడాది మహిళా సంఘాలకు రూ. 900 కోట్లు మంజూరు చేయగా, ఈ ఏడాది రూ. 1000 కోట్లు మంజూరు చేశామన్నారు. రూ. 204 కోట్లు చెక్కులు మహిళా సంఘాలకు అందజేశామన్నారు. సంగారెడ్డి జిల్లా ప్రగతి నివేదిక పుస్తకాన్ని మంత్రి హరీశ్‌రావుతో కలసి కలెక్టర్ శరత్ ఆవిష్కరించారు.

### జహీరాబాద్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశాం

జహీరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. సీఎం కేసీఆర్, రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు సహకారంతో నియోజకవర్గంలో ఎన్నో పనులు చేశామమని చెప్పారు. శాసనసభ ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. ఎప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తానని చెప్పారు.



